క్లుప్తంగా

మంత్రి లోకేష్ కార్మికుల సమస్య పరిష్కరించాలి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మనందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు గత 695 రోజులుగా దీక్షలు చేస్తున్నారని, ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గం పట్ల మొండిగా వ్యవహరించడం సరి కాదని, కార్మికుల న్యాయమైన సమస్య పరిష్కారానికి మంత్రి లోకేష్ చొరవ చూపాలని కోరారు. దీక్షల్లో లాజర్‌బాబు, పుష్పలీల, శారమ్మ, రమాదేవి, నాగమల్లేశ్వరి కూర్చొనగా.. శిబిరాన్ని స్టీవెన్, సాంబశివరావు, ఇమాంబి, రిబ్కా, నవనీతమ్మలు ప్రారంభించారు. కార్యక్రమంలో యహోషువ, పిచ్చయ్య, హగ్గయ్య, అంకయ్య, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, మహిళా, బీసీ ఓటర్ల తుది జాబితా విడుదల



మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ (ఎంటీఎంసీ) పరిధిలో నిర్వహించనున్న సాధారణ ఎన్నికలు–2026 నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, మహిళా, బీసీ ఓటర్లకు సంబంధించిన తుది జాబితాలను గురువారం అధికారులు ప్రచురించారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వార్డుల వారీగా ఇంటింటి సర్వే ద్వారా గుర్తించిన ఓటర్ల వివరాలతో ఫారం–6లో ఈ జాబితాలను రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రజల పరిశీలనార్థం అందుబాటులోకి తీసుకొవచ్చామని తెలిపారు. తుది ఓటర్ల జాబితాలను ప్రజల పరిశీలనార్థం ఎంటీఎంసీ కార్యాలయం, మంగళగిరి, తాడేపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, తెనాలి, మంగళగిరి, తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. సంబంధిత వార్డులకు చెందిన ఓటర్లు ఆయా కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న తుది జాబితాలను పరిశీలించవచ్చని కమిషనర్ వెల్లడించారు.

రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు



తాడికొండ: రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన 138 మంది రైతులకు గురువారం రాయపూడిలోని ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఎ.భార్గవతేజ ఆధ్వర్యంలో ఈ–లాటరీ విధానం ద్వారా 163 రిటర్నబుల్ ప్లాట్లను అధికారులు కేటాయించారు. కార్యక్రమానికి హాజరైన రైతుల సమక్షంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రైల్ రన్ వేసిన అనంతరం ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు ఏపీ సీఆర్డీఏ ల్యాండ్స్ (క్యాపిటల్ సిటీ) విభాగ డైరెక్టర్ కేఎస్ భాగ్యరేఖ ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని భాగ్యరేఖ కోరారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.పద్మావతి, ఐటీ, ప్లానింగ్, జీఐఎస్ కమ్యూనికేషన్స్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్‌కు భూమి అందజేత

తాడికొండ: రాజధాని నిర్మాణం కోసం ఏపీ సీఆర్డీఏ చేపట్టిన రెండో దశ ల్యాండ్ పూలింగ్‌కు మోతడకకు చెందిన రైతులు శ్రీనివాసరావు, వెంకటరావమ్మ తమ ఆధీనంలో ఉన్న 6.09 ఎకరాల భూమిని పూలింగ్ కింద అందజేసేందుకు ముందుకొచ్చారు. గురువారం శ్రీనివాసరావు 5.01 ఎకరాలు, వెంకటరావమ్మ 1.80 ఎకరాల భూమిని పూలింగ్ నిమిత్తం కాంపిటెంట్ అధికారి పి.కృష్ణారావుకి 6.09 ఎకరాల భూమికి సంబంధించిన అంగీకార పత్రాలు అందజేశారు. పెదపరిమి గ్రామానికి చెందిన రైతులు పఠాన్ గోపాల్, పఠాన్ మోను తమ ఆధీనంలో ఉన్న 7.01 ఎకరాల భూమిని పూలింగ్ కింద అందజేసేందుకు ముందుకొచ్చారు. గురువారం పెదపరిమి–2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి.రాధిక ఆధ్వర్యంలో స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ డి.వీరభద్రరావుకు సంబంధించిన అంగీకార పత్రాలు అందజేశారు.

దుగ్గిరాలలో ముమ్మరంగా ప్రచారం



ఎన్నికల ప్రచారంలో మోరంపూడి ఎంపీటీసీ అభ్యర్థి శృంగారపాటి అక్షయరాణి



కొర్రపాడులో ప్రచారం చేస్తున్న కంకణాల సుమలత

దుగ్గిరాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఘన విజయంతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థులు కోరారు. గురువారం అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మాట్లాడారు. మోరంపూడి ఎంపీటీసీ అభ్యర్థి శృంగారపాటి అక్షయరాణి, దుగ్గిరాల–3 ఎంపీటీసీ అభ్యర్థి మన్నవ శ్యామలా దేవి గ్రామాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు.

మండలంలోని పార్టీ ఎంపీటీసీలను, అలానే జడ్పీటీసీ అభ్యర్థి తాడిబోయిన శివగోపయ్యను గెలిపించాలని కోరారు. చంద్రబాబు పాలన అవినీతి, అరాచక పాలనతో నిండిందని.. బాబు సర్కార్‌కు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి దౌర్జన్యంగా పాలన సాగిస్తుందని మండిపడ్డారు. తొలుత దుగ్గిరాల అలీనగర్ హజరత్ సబీరుల్లా బాబా అవ్వులీయ్యా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో షేక్.సుభాని, షేక్.బాజీ, షేక్.బాషా, షేక్ అన్సారీ, అభిమానులు,



దుగ్గిరాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పార్టీ నాయకులు

కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విస్తృత ప్రచారం

మేడికొండూరు: మేడికొండూరు మండలం కొర్రపాడు, మేడికొండూరు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం గురువారం ఉత్సాహంగా కొనసాగింది. పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) ఆధ్వర్యంలో కొర్రపాడులో జెడ్పీటీసీ అభ్యర్థి కంకణాల సుమలత, ఎంపీటీసీ అభ్యర్థి



మేడికొండూరు ప్రచార కార్యక్రమంలో నాగుల్ షరీఫ్

చౌటూరి వెంకటేశ్వర్లు ఇంటింటా ప్రచారం నిర్వహించి ప్రజలను కలిశారు. అదేవిధంగా మేడికొండూరు ఎంపీటీసీ 2వ సెగ్మెంట్ అభ్యర్థి షేక్ నాగుల్ షరీఫ్ ప్రచారంలో పాల్గొని ప్రజలను కలిసి మద్దతు కోరారు. నాయకులు, కార్యకర్తలు అభ్యర్థులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పార్టీ తరఫున ప్రచారం నిర్వహించారు. రెండు గ్రామాల్లోనూ పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచార కార్యక్రమాలను జోష్‌గా కొనసాగించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న తాడేపల్లి మండల వ్యవసాయాధికారిణి శిరీష

తాడేపల్లి రూరల్: అర్నబ్ సైక్లోన్ ప్రభావంతో తాడేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న వరి, మినుము పంటలను వ్యవసాయాధికారిణి పి.శిరీష గురువారం పరిశీలించారు. చిర్రావూరు, గుండిమెడ, ప్రాతూరు, తాడేపల్లి గ్రామాల్లో పంట పొలాలను సందర్శించి వర్షాల కారణంగా పంటలకు కలిగిన నష్టాన్ని పరిశీలించారు. పంటల పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకున్నారు. తాడేపల్లి మండలంలో సుమారు 1,519 ఎకరాల్లో వరి, 150 ఎకరాల్లో మినుము పంటలను రైతులు సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి తెలిపారు. ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట దశ నుంచి గింజ పాలు పోసుకునే దశలో ఉండగా, మినుము పంట 30 నుంచి 45 రోజుల దశలో ఉందని పేర్కొన్నారు. ఈ సమయంలో అధిక వర్షాల వల్ల పంట పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పొలాల్లో వర్షపు నీరు అధికంగా నిల్వ ఉండకుండా కాలువలు, బోదెల ద్వారా నీటిని బయటకు పంపించాలని రైతులకు సూచించారు. తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు సేకరించి, నష్ట పరిహారానికి సంబంధించిన జాబితాను రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏలు) వంశీ, అఖిల్, పావని, ఏఈఓ రమేష్ పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్‌పై విస్తృత తనిఖీలు



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ఎంటీఎంసీ కమిషనర్ ఎస్.అలీంబాషా ఆదేశాల మేరకు గురువారం తాడేపల్లి ప్రాంతంలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ మల్లిక ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యదర్శులు వివిధ దుకాణాలు, వాణిజ్య సంస్థలను తనిఖీ చేశారు. ఉండవల్లి సెంటర్ పరిసరాల్లో తనిఖీలు చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 10 కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత దుకాణాలపై రూ.2,300 జరిమానా విధించారు. తనిఖీలు నిర్వహించడంతో పాటు నిషేధిత ప్లాస్టిక్ వల్ల కలిగే పర్యావరణ నష్టాలను వ్యాపారులు, ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు గుడ్డ సంచులు, కాగితపు సంచులు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించినా, విక్రయించినా నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్లాస్టిక్ రహిత మంగళగిరి తాడేపల్లి నిర్మాణానికి వ్యాపారులు, ప్రజలు సహకరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.

తుపాను ప్రభావంతో అన్నదాతలు విలవిల



పెనుమూలి, కొలకలూరి గ్రామాల మధ్య నేలవాలిన వరిపైరు

దుగ్గిరాల: అర్నబ్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వానల వల్ల వరి, మినుము పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో నష్టాల ఊబిలో పడ్డామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుగ్గిరాల మండలంలోని పలు ప్రాంతాల్లో తుపాను కారణంగా కురిసిన వర్షానికి 2,597 హెక్టార్లలో వరి, 341 హెక్టార్లలో మినుము పంట పాక్షికంగా నీట మునిగినట్లు వ్యవసాయ అధికారి ఆర్.విజయబాబు తెలిపారు. కాగా పంట పొలాల్లో నీరు ఎక్కువగా నిలిచిపోయింది. కంకె పాలు పోసుకుంటున్న దశలో నీరు అధికమయ్యి బయటకు పోవడానికి వీలు లేకపోవడంతో వరి పంటలు పూర్తిగా వాలిపోయి పడిపోయాయి. ఆరుగాలం పండించిన పైరు ఒక్కసారిగా నేలవాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఐఐఎస్ డబ్ల్యూస్ బృందం క్షేత్రస్థాయి పర్యటన



ఫిరంగిపురం: మండలంలోని మునగపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పంటలను గురువారం భారతీయ నేల, జల సంరక్షణ పరిశోధన సంస్థ (ఐఐఎస్‌డబ్ల్యూస్) బృంద సభ్యులు పరిశీలించారు. వర్షపు నీరు నేలలో ఇంకే విధానం, నేల స్వభావం, నీటి ప్రవాహం, పంటల స్థితిగతులను అడిషనల్ ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ, న్యాచురల్ ఫార్మింగ్ అసోసియేట్ ఉమాదేవి, యంగ్ రీసెర్చ్ లావణ్యలు వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో పాటు అంతర పంటల సాగు విధానాలు తెలియజేశారు. అనంతరం 113.తాళ్లూరు గ్రామంలోని రైతుసాధికారత కేంద్రం పరిధిలో మిరప, టమాటా క్షేత్రాలను పరిశీలించారు. వాటితో పాటు ఘన జీవామృతం, ద్రవజీవామృతం, నీమాస్త్రం, బీజామృతం తయారీ విధానం వివరించారు. కార్యక్రమంలో బృంద సభ్యులు డాక్టర్ బి.కృష్ణారావు, మధు, జిల్లా మోడల్ మేకర్ ఇ.వెంకటేశ్వర్లు, రైతులు లక్ష్మారెడ్డి, వీరమ్మ, ఎం.నిర్మల పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు దూరంగా నలుగురు చిన్నారులు

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పసిప్రాణాలు



మంగళగిరి టౌన్: మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి డాన్‌బాస్కో స్కూల్ సమీపంలో సుమారు రెండేళ్ల నుంచి నాలుగేళ్ల వయసున్న నలుగురు చిన్నారులు ఒంటరిగా రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండడాన్ని డోలాస్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మేడ వాసు, ఆయన భార్య బ్యూల గుర్తించారు. చిన్నారులు ఎవరూ లేకుండా రోడ్డుపై తిరుగుతుండడంతో స్పందించిన ఆ దంపతులు వారిని జాగ్రత్తగా మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీసులు చిన్నారులను విచారించగా ఆళ్లయ్య, కాశి, వెంకన్న, మారమ్మ అని తమ పేర్లు చెప్పినట్లు తెలిసింది. అయితే వారి తల్లిదండ్రులు ఎవరు.. ఎక్కడ నివసిస్తున్నారు.. చిన్నారులు అక్కడికి ఎలా వచ్చారు.. అనే వివరాలు తెలియాల్సి ఉంది. పసి పిల్లలను చూసిన వెంటనే సీఐ చిరుమామిళ్ల వెంకట్ స్పందించి వారికి అవసరమైన ఆహార పదార్థాలను వెంటనే తెప్పించి అందించారు.

ఉచిత సంతాన సాఫల్య శిబిరం రేపు

తాడేపల్లి రూరల్: ఉచిత సంతాన సాఫల్య శిబిరాన్ని శనివారం ఉండల్లిలో నిర్వహించనున్నట్లు ఏఆర్ హెల్త్ క్లినిక్ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఫెర్టిలీస్ విథనీయా హాస్పిటల్, ఉండవల్లి ఏఆర్ హెల్త్ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఉండవల్లి అమరావతి రోడ్, సుజికి షోరూమ్ ఎదురు గల ఏఆర్ హెల్త్ క్లినిక్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత సంతాన సాఫల్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన విజయవాడ ఫెర్టిలీస్ విథనీయా హాస్పిటల్ డాక్టర్లు పాల్గొని సంతాన సమస్యలతో బాధపడుతున్న దంపతులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలు, సూచనలు అందించనున్నారని అన్నారు. క్యాంపునకు వచ్చిన దంపతులకు ఉచిత కౌన్సిలింగ్, కన్సల్టేషన్, వీర్య కణాల పరీక్ష, మొదటి స్కానింగ్ ఉచితంగా చేయనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. సంతాన సమస్యలు ఎదుర్కొంటున్న దంపతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంటీఎంసీ 261 తుది పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రచురణ



మంగళగిరి టౌన్: ఎంటీఎంసీ పరిధి 62 డివిజన్లకు సంబంధించిన 261 తుది పోలింగ్ స్టేషన్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం ఎంటీఎంసీ అధికారులు ప్రచురించారు. ఈ జాబితాను నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచినట్లు కమిషనర్ అలీంబాషా పేర్కొన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం, గుంటూరు కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం, తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, మంగళగిరి, తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయాల్లో జాబితాలను అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్ కోర్టు, శాఖా గ్రంథాలయం, ప్రధాన తపాలా కార్యాలయం, యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ వద్ద కూడా జాబితాలను పరిశీలించుకునే అవకాశం కల్పించామని తెలిపారు.


అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తాడికొండ: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన తుళ్లూరు మండలం మందడం పరిధిలోని నవయుగ ఫ్లై ఓవర్ సమీపంలో డొంకరోడ్డుపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నట్లు 112కు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు కేరళం రాష్ట్రానికి చెందిన రాజన్(45) అని.. అతను ఎల్‌అండ్‌టీ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్లుగా గుర్తించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగులు పోస్టల బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

దుగ్గిరాల: స్థానిక సంస్థల ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని దుగ్గిరాల ఆర్వో టి.నరసింహారెడ్డి తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు విధులు నిర్వహించే ఉద్యోగులు ఈనెల 30, 31 తేదీల్లో మండల పరిషత్ కార్యాలయం వద్దకు వచ్చి తగిన ఆధారాలతో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

రాష్ట్రీయ ఇన్నోవేషన్‌లో కేఎల్‌యూకు అవార్డులు



తాడేపల్లి రూరల్ : రాష్ట్రీయ ఇన్నోవేషన్ చాలెంజ్ 2026లో తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్‌యూ విశేష ప్రతిభ కనబరిచి రెండు అవార్డులు సాధించినట్లు వర్శిటీ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ వి.రాజేష్ గురువారం తెలిపారు. ఆవిష్కరణలు, సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన రాష్ట్రీయ ఇన్నోవేషన్ చాలెంజ్ 2026లో రెండు విభాగాల్లో అవార్డులు సాధించి కేఎల్‌యూ తన సత్తా చాటినట్లు పేర్కొన్నారు. వర్శిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ విజేతలను అభినందించారు.

ఆయన మాట్లాడుతూ.. గుంటూరు, కృష్ణా, మార్కాపురం, పల్నాడు జిల్లాలకు చెందిన సుమారు 80 జట్లు ఈ చాలెంజ్‌లో పాల్గొన్నాయని తెలిపారు. నాలుగు ప్రధాన రంగాల్లో పోటీలు నిర్వహించి, ప్రతి జిల్లాలో ఒక్కో రంగానికి ఒక అవార్డును అందజేశారని తెలిపారు. గుంటూరు జిల్లా స్థాయిలో అక్టోబర్ 29న పోటీ ఫలితాలను ప్రకటించారని, ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొన్నాయని పేర్కొన్నారు. కేఎల్‌యూ విద్యార్థుల బృందాలు రెండు విభాగాల్లో అవార్డులు సాధించినట్లు వెల్లడించారు. విజేతలుగా నిలిచిన జట్లకు ఒక్కో విభాగంలో రూ. 10 వేల చొప్పున నగదు బహుతులు లభించినట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి సీఐఐఈ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.సలీమ్ అక్బర్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అధికారి డాక్టర్ కేవీజీ నాయుడు, ఫ్యాబ్ ల్యాబ్ డైరెక్టర్ డాక్టర్ గౌరవ్‌కుమార్ హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ వీసీలు డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన



ఇండస్ట్రియల్ విజిట్‌లో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పెనుమాకలోని పీఎం శ్రీ వందేమాతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పదో తరగతులు చదువుతున్న విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఇండస్ట్రియల్ విజిట్ గురువారం నిర్వహించారు. పాఠశాలలో ఒకేషనల్ ట్రైనర్‌గా పనిచేస్తున్న గొల్లపల్లి రాఘవేంద్ర సాయిదేవ్ విద్యార్థులను వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ–ఆంధ్రప్రదేశ్ (వీఐటీ–ఏపీ) యూనివర్సిటీకి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులు యూనివర్సిటీలోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, బిజినెస్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ల్యాబ్‌లను సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న వివిధ ప్రాజెక్టులు, సాంకేతిక ప్రయోగాలు, నూతన ఆవిష్కరణలకు సంబంధించిన అంశాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. డ్రోన్ల తయారీ విధానం, ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ ప్రక్రియ, త్రీడీ ప్రింటర్‌తో వివిధ ప్రాజెక్టుల రూపకల్పన, ఎలక్ట్రానిక్స్ ల్యాబ్‌లోని నమూనాలను విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు.

అర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన



రైతులతో మాట్లాడుతున్న లాం ఫాం శాస్త్రవేత్తల బృందం

తాడికొండ: అర్నబ్ తుఫాన్ ప్రభావతి ప్రాంతాల్లో గురువారం లాం వ్యవసాయ పరిశోధనా స్థానం (లాం ఫాం) శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రాపురం, తాడికొండ, నిడుమొక్కల, మోతడక గ్రామాల్లో పర్యటించి పత్తి, మినుము, కంది, వరి పంటల్లో ప్రస్తుత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ.. పొలాల్లో అధికంగా ఉన్న నీటిని మురుగు కాల్వలు ఏర్పరచి బయటకు పోయేటట్లు చేయాలన్నారు. సేద్య విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ ప్రతిభాశ్రీ మాట్లాడుతూ.. అధిక వర్షాల వల్ల ఒరిగిన మొక్కలకు మట్టిని ఎగదోసి సూక్ష్మ పోషక లోపాలను గమనించి నివారించుకోవాలని సూచించారు. ఏపీజీసీ అసోసియేట్ డీన్ డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిద్రావస్థ లేని బీపీటీ 5204 వంటి రకాలు సాగు చేసే ప్రాంతాల్లో అధికంగా ఉన్న నీటిని త్వరగా బయటకు పంపించి గింజ రంగు మారకుండా పై పాటుగా ఎకరానికి ప్రాపికొనజోల్ 200 మిల్లీ లీటర్లు పిచికారీ చేయాలన్నారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మనోజ్ (టీవోటీ) మాట్లాడుతూ.. అధిక తేమ వల్ల మొక్కలు నేల నుంచి పోషకాలను సంగ్రహించలేవని, పై పాటుగా పొటాషియం నైట్రేట్ లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని కోరారు. సహాయ వ్యవసాయ సంచాలకులు–వ్యవసాయ అధికారి తుళ్లూరు సంధ్యారాణి మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలను అనుసరించి పంటల వారీగా నష్టాన్ని అంచనా వేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీజీసీ కళాశాల ఆచార్యులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, వివిధ గ్రామాల రైతులు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై గుంటూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట రాయుళ్ల నుంచి రూ.29,500 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పెనుమాక–ఎర్రబాలెం రోడ్డు సమీపంలోని ఓ కోళ్ల ఫారం వెనుక పేకాట నిర్వహిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈ విషయాన్ని ఎస్‌బీ డీఎస్పీకి తెలియజేసి, టాస్క్‌ఫోర్స్ సీఐ–2 పర్యవేక్షణలో తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. పోలీసులు అక్కడికి చేరుకోవడాన్ని గమనించిన పేకాట ఆడుతున్న వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ వ్యవహారంలో ఎర్రబాలెంకు చెందిన రాముడు, లక్ష్మణుడు పేర్లు గుర్తించినట్లు సమాచారం. పరారైన వ్యక్తుల వివరాలు, పేకాట నిర్వహణకు సంబంధించిన అంశాలపై తాడేపల్లి పోలీసులు విచారణ చేపట్టారు. దాడిలో పేకాట రాయుళ్ల వద్ద నుంచి రూ.29,500 నగదు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని తదుపరి విచారణ నిమిత్తం తాడేపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందికి అప్పగించారు.

రైతులకు అండగా ఉంటాం

మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలిటౌన్: అర్నబ్ తుఫాన్ ప్రభావంతో తీవ్ర ఈదురు గాలులకు, వర్షాలకు నేల వాలిన వరి పొలాలను గురువారం స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. ఈదురు గాలుల వల్ల నేలవాలిన వరి పైరును పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. నష్టం అంచనాలను సమగ్రంగా వేయించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్
మంగళగిరి బ్రాంచ్, మంగళగిరి, గుంటూరు జిల్లా
సవరణ
ది.29-10-2026న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన శ్రీమతి వల్లేటి ప్రసూష గారికి సంబంధించిన ఇ-వేలము అమ్మకం ప్రకటనలో ఆస్తి ఐడి నెం. IDIB50472535107కు బదులుగా IDIB50205027304 అని తప్పుగా ప్రచురించబడినది. కావున, ఆస్తి ఐడి నెం. IDIB50472535107 అని చదువుకొనవలెను. మిగిలిన నియమ నిబంధనలతో ఎటువంటి మార్పులేదు. మరిన్ని వివరములకు సంప్రదించండి: 0864-5234249, 9951331382.

పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. ఈ ఫోన్ నెంబర్లకు తెలుపగలరు. తగు చర్యలు తీసుకోనబడును.
షేక్ అబ్దుల్లా - సర్క్యులేషన్ ఇన్‌చార్జ్ : 9010614996
తాడికొండ - గుమ్మా నాగ శేఖర్ (ACO)- 9912440410
మంగళగిరి - రాజశేఖర్ పిల్లి - 7997958375
యం.మల్లిఖార్జునరావు - JO - 9705977784
టోల్ ఫ్రీ నెం. : 1800 2125 9899
సాక్షి తెలుగు దినపత్రిక
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు, శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచినవారు
మంగళగిరి డివిజన్
99122 25447 (మంగళగిరి)
70751 67541 (తాడికొండ)